నవంబర్‌లోగా ఐడీవోసీ పూర్తి చేయాలి: కలెక్టర్

కలెక్టరేట్, ఆగస్టు 13 : సమీకృత జిల్లా కార్యాలయ సముదాయాల నిర్మాణ పనులు పూర్తి చేసి, నవంబర్ నెలాఖరులోగా అందించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. మంగళవారం సాయంత్రం ఐడీవోసీ నిర్మాణ పనులు అధికారులు, గుత్తేదారుతో కలిసి పరిశీలించారు. పచ్చని మొక్కలతో ఆకట్టుకునేలా కొత్త కలెక్టరేట్ ఆవరణలో గార్డెన్ ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్, గ్రానైట్, పెయింటింగ్ పనులు జరుగుతున్న తీరుపై తెలుసుకున్నారు. పనులు సక్రమంగా జరిగేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని ఆర్ అండ్‌బీ ఈఈ సాంబశివరావుకు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఈ లక్ష్మణ్, ఏఈఈ రాజశేఖర్, గుత్తేదారులు మధుసూదన్‌రావు, సలాఉద్దీన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పేదల పెన్నిధి కేసీఆర్: ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్ రూరల్, ఆగస్టు 13: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదల పెన్నిధిగా నిలిచారని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కొనియాడారు. మంగళవారం హుజూరాబాద్ మండలంలోని చెల్పూర్, ఇందిరానగర్, రాజపల్లి, రాంపూర్, రంగాపూర్, పోతిరెడ్డిపేట్, సిర్సపల్లి గ్రామాల్లో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, శాలిని దంపతులు స్వయంగా వారి ఇండ్లకు వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేసే వరకు బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. నియోజకవర్గంలో ఏ కుటుంబానికి కష్టం వచ్చినా, ఎక్కడ ఏ సమస్య తలెత్తినా పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, జమ్మికుంట, హుజూరాబాద్ మున్సిపల్ అధ్యక్షులు గందె రాధికాశ్రీనివాస్, తక్కళ్లపల్లి రాజేశ్వరరావు, హుజూరాబాద్ సింగిల్ విండో చైర్మన్ కొండల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఇరుమల్ల రాణి–సురేందర్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, నాయకులు రమేశ్, తిరుపతి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

జమ్మికుంట, ఆగస్టు 13: మహిళలు ఆర్థికంగా ఎదగాలని, అందుకు అవసరమైన సహాయ, సహకారాలు బ్యాంకులు అందిస్తున్నాయని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, కమిషనర్ ఎండీ అయాజ్, మెప్మా డీఎంసీ శ్రీవాణి, ఏడీఎంసీలు మానస, మల్లీశ్వరి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పట్టణ సమాఖ్య ఆధ్వర్యంలో మెప్మా 13వ వార్షిక సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన వక్తలు మాట్లాడుతూ.. సంఘ సభ్యులు బ్యాంకులు అందిస్తున్న రుణాలను ఆయా రంగాల్లో పెట్టుబడి పెట్టి ఆర్థికాభివృద్ధి సాధించాలని, ఉన్నత స్థానాలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో తమ వంతు పాత్ర పోషించడం సంతోషంగా ఉందని పట్టణ అధ్యక్షురాలు రాణి అన్నారు. ఇక్కడ సీఎల్ ఆర్పీలు, ఆర్పీలు, ఓబీలు, మెప్మా సభ్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ అద్దె భవనాల ఖాళీ

కలెక్టరేట్, ఆగస్టు 13 : నగరంలోని కార్ఖానాగడ్డలో గల ఎస్సీ కార్పొరేషన్ అద్దె భవనాలు ఎట్టకేలకు ఖాళీ అయ్యాయి. కలెక్టర్ ఆదేశాలతో సంబంధిత శాఖ అధికారులు దగ్గరుండి మంగళవారం దుకాణా సముదాయాల్లోని సామగ్రి తొలగించారు. పదిహేనేళ్ల నుంచి ఏకధాటిగా లీజుదారులు నామమాత్రపు అద్దె చెల్లిస్తూ, సబ్‌లీజులతో లక్షలాది రూపాయలు ఆర్జిస్తుండగా కొంతమంది ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చారు. దీనిపై సీరియస్‌గా స్పందించిన కలెక్టర్ కోర్టు సూచనతో వారికి కొంత గడువు ఇచ్చినా ఖాళీ చేయకపోవడంతో, ఇటీవల నోటీసులు జారీ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. అయినా, లీజుదారుల్లో ఎలాంటి స్పందన కానరాకపోవడంతో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నాగార్జున నేతృత్వంలో సిబ్బంది, ఆయా దుకాణాల్లోని సామగ్రిని కూలీల సాయంతో మంగళవారం రాత్రి వరకు తొలగించి, వాటిని స్వాధీనం చేసుకున్నారు. త్వరలోనే టెండర్లు నిర్వహించి అధిక ధరలు కోట్ చేసిన వారికి లీజుకు ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు.

బొమ్మకల్ సెక్షన్‌లో సంబురాలు

ముకరంపుర, ఆగస్టు 13: డిస్కం స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించిన సందర్భంగా బొమ్మకల్ సెక్షన్ సిబ్బంది మంగళవారం సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సెక్షన్ ఏఈ తిరుపతి మాట్లాడుతూ, అధికారుల సూచనల మేరకు నిర్దేశించిన ప్రామాణికాలకు అనుగుణంగా అంతా కలిసి సమష్టిగా పనిచేయడం ద్వారానే డిస్కం స్థాయిలో సెక్షన్‌కు ప్రత్యేక గుర్తింపు దక్కిందన్నారు. సిబ్బందిని అభినందిస్తూ స్వీట్లు పంచి పెట్టారు. కార్యక్రమంలో సబ్ ఇంజినీర్ అనూష, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ రఘుపతి, లైన్ ఇన్‌స్పెక్టర్ కొండగట్టు, లైన్ మెన్‌లు ప్రకాశ్, ఫారూక్, జూనియర్ లైన్ మెన్‌లు చంద్రశేఖర్, శ్రీకాంత్, అమర్, రఘు, సిబ్బంది శ్రీనివాస్, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి కోసం వంటావార్పు

గన్నేరువరం, ఆగస్టు 13: మైలారం గ్రామం మైసమ్మ గుట్ట నుంచి కరీంనగర్ వరకు మానేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని బ్రిడ్జి సాధన కమిటీ అధ్యక్షుడు సంపతి ఉదయ కుమార్ ఆధ్వర్యంలో మైసమ్మ గుట్ట వద్ద మంగళవారం వంటావార్పుతో నిరసన తెలిపారు. కార్యక్రమానికి గన్నేరువరంతో పాటు బెజ్జంకి, ఇల్లంతకుంట మండలాల ప్రజలు మద్దతు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ, గతంలో ఎన్నికల ప్రచారంలో ఎంపీ బండి సంజయ్‌కుమార్, పొన్నం ప్రభాకర్ బ్రిడ్జి నిర్మాణానికి హామీ ఇచ్చి మరిచారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు రామచంద్రరావు, పురంశెట్టి బాలయ్య, జక్కనపల్లి సత్తయ్య, సీపీఐ మండల కార్యదర్శి కాంతాల అంజిరెడ్డి, తోట రాజేశం, నూకల తిరుపతి, మర్రి వెంకటమల్లు, సుద్దాల రాయమల్లు, నూకల మల్లయ్య, నూకల చింటూ, జక్కనపల్లి రాజకుమార్ పాల్గొన్నారు.

డివిజన్ల సమస్యలపైనే చర్చ

- ఎజెండా అంశాలకు ఆమోదం
- ప్రశాంతంగా బల్దియా సర్వసభ్య సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ కార్పొరేషన్, ఆగస్టు 13 : కరీంనగర్ నగరపాలక సంస్థ సర్వ సభ్య సమావేశం మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. డివిజన్ల సమస్యలపైనే ప్రధానంగా చర్చ జరిగింది. నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు అధ్యక్షతన మంగళవారం ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవగా, జీరో అవర్‌లో పాలకవర్గ సభ్యులు డివిజన్ల వారీగా ప్రజా సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా రోడ్లు, డ్రైనేజీ సమస్యలతోపాటు పారిశుధ్య సమస్యలు, దోమలు, కుక్కలు, కోతుల బెడదపై సభ్యులు మాట్లాడారు. నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న విషజ్వరాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. 84 ఎజెండా అభివృద్ధి అంశాలు, 180 టేబుల్ ఎజెండా అభివృద్ధి అంశాలకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.

సభ దృష్టికి సమస్యలు..

నగరంలోని వివిధ డివిజన్ల సమస్యలను సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. డంపు యార్డ్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని సభ దృష్టికి తీసుకురాగా.. కలెక్టర్ త్వరలోనే డంప్‌యార్డుకు సంబంధించిన స్థలాన్ని ఇప్పిస్తామని హామీ ఇచ్చారని అధికారులు తెలిపారు. కోతి రాంపూర్ చౌరస్తా పనులను చేపట్టాలని కోరారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల వాహనాలకు సరైన సమయంలో మరమ్మతులు చేయించలేకపోయారని కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్ పేర్కొన్నారు. మరమ్మతుల కోసం కార్మికులు సమ్మె చేయడం అధికారుల తీరుకు నిదర్శనమన్నారు. కుక్కల బెడదను అరికట్టేందుకు ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్లు పూర్తి పరిష్కారం కాదని, పందులను అరికట్టేందుకు ఏ విధంగా పనిచేశామో అలా చేస్తేనే తప్ప సాధ్యం కాదని పేర్కొన్నారు. పద్మనగర్ జంక్షన్ అభివృద్ధి చేయాలని, పార్కింగ్ లేని ఫంక్షన్ హాళ్లపై చర్య తీసుకోవాలని కోరారు. నగరంలో ఇటీవల చేసిన చౌరస్తాల అభివృద్ధి పనుల్లో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని, వీటిపై విజిలెన్స్ విచారణ చేయాలని సభ్యుడు బండారి వేణు కోరారు.

మెరుగైన సదుపాయాలు కల్పిస్తాం: మేయర్

నగర ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. పాలకవర్గ సభ్యులు సభ దృష్టికి తెచ్చిన ప్రతి సమస్యనూ పరిష్కరించి ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. పారిశుధ్యం మెరుగు పరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్మికులపై భారం పడకుండా యంత్రాలతో పారిశుధ్య పనులు చేపడుతున్నామన్నారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణీహరిశంకర్, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అసిస్టెంట్ కమిషనర్ వేణు మాధవ్, ఈఈ యాదగిరి, ఇన్‌చార్జి ఏసీపీ వేణు పాల్గొన్నారు.

జ్యోతిష్మతిలో గ్రాడ్యుయేట్ డిగ్రీ ప్రోగ్రాంపై అవగాహన

సమావేశంలో మాట్లాడుతున్న కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు

తిమ్మాపూర్ రూరల్, ఆగస్టు 13 : మండలంలోని జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (అటానమస్) కళాశాలలో విద్యార్థులకు మంగళవారం లూసియానా టెక్ యూనివర్సిటీ ఇంటర్నేషనల్ అఫైర్స్ డైరెక్టర్ జేఆర్ లిగాన్ యూఎస్ఏ గ్రాడ్యుయేట్ డిగ్రీ ప్రోగ్రాంలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జేఆర్ లిగాన్‌తో కలిసి కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్ రావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జువ్వాడి సుమిత్ సాయి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం కళాశాల చైర్మన్ మాట్లాడుతూ కళాశాల నిరంతరం విద్యార్థుల అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. కరస్పాండెంట్ సుమిత్ సాయి మాట్లాడుతూ విద్యార్థుల విద్యా అనుభవాన్ని పెంపొందించడంలో అంతర్జాతీయ సహకారాల పాత్ర గురించి వివరించారు. జేఆర్ లిగాన్ గ్రాడ్యుయేట్ డిగ్రీ ప్రోగ్రాంలను పరిచయం చేస్తూ లూసియానా టెక్ యూనివర్సిటీలో అందుబాటులో ఉన్న వివిధ విద్యా కార్యక్రమాలు, పరిశోధన అవకాశాలు, విశ్వవిద్యాలయ విశేషాల గురించి సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ రావు, డీన్ అకాడమిక్స్ అండ్ ఆడిట్ డాక్టర్ సీకే వైశాలి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

'రాఖీ'కి 726 ప్రత్యేక బస్సులు

కరీంనగర్ తెలంగాణ చౌక్, ఆగస్టు 13 : ఈ నెల 19న రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నది. కరీంనగర్ రీజియన్ పరిధిలో ప్రత్యేక బస్సులను నడిపించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ నెల 14 నుంచి 21 తేదీ వరకు ప్రత్యేక బస్సులను నడిపించనున్నారు. ఈ నెల 14న జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు 83 బస్సులు, 16న 58 బస్సులు, 17న 145 బస్సులు, 19న కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు 150 బస్సులు, 20న 150 బస్సులు, 21న 140 బస్సులను నడిపించనున్నారు. మొత్తం 726 ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నారు. వీటిలో అదనపు చార్జీలు ఉండవు. మహిళా ప్రయాణికులు అధిక సంఖ్యలో ప్రయాణిస్తారని అధికారులు అంచనావేశారు. ఈ మేరకు రీజియన్ పరిధిలోని అన్ని డిపో మేనేజర్లతో ఆర్ఎం సుచరిత మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు.

కబ్జాదారులపై కఠిన చర్యలు: ఆర్డీవో

జమ్మికుంట, ఆగస్టు 13: కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుంటామని హుజూరాబాద్ ఆర్డీవో ఎస్ రమేశ్‌బాబు స్పష్టం చేశారు. మంగళవారం ఆయన జమ్మికుంట తహసీల్ కార్యాలయానికి వచ్చారు. మండల తహసీల్దార్ జీ రమేశ్‌బాబు సమక్షంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆర్డీవో విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల జరుగుతున్న భూకబ్జాలు, ముఖ్యంగా 467పై కొలతలు వేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. భూయజమానులు, తదితరులకు సర్వేయర్‌తో నేడు నోటీసులు జారీ చేస్తామని, త్వరలో కొలతలు వేసి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంటామని తహసీల్దార్ జీ రమేశ్‌బాబు చెప్పారు.

టీహెచ్ఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా లక్ష్మణ్

రామడుగు, ఆగస్టు13 : తెలంగాణ రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్(టీహెచ్ఏ) రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా రామడుగు మండల కేంద్రానికి చెందిన హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బసరవేణి లక్ష్మణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. హైదరాబాద్‌లోని నాచారం ఢిల్లీ పబ్లిక్‌స్కూల్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఎన్నికల్లో మండలానికి చెందిన బసరవేణి లక్ష్మణ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా, నమిలకొండ ప్రభాకర్‌ను ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎన్నుకున్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు మల్క యశస్విని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించి, ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సేఫ్టీ మోకుపై అవగాహన

చొప్పదండి, ఆగస్టు 13: పట్టణంలో కాటమయ్య రక్షణ కవచం (సేఫ్టీ మోకు)పై మంగళవారం గౌడ కార్మికులకు అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రాక్ మౌంటెన్ క్లైంబింగ్‌లో నిష్ణాతులైన శిక్షకుల ద్వారా సేఫ్టీ మోకును ఉపయోగించే విధానం, మెళకువలు నేర్పించారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా తాటి వనంలో ఈత మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ పగిడిపల్లి శ్రీనివాస్, బీసీ వెల్ఫేర్ అధికారి అనిల్, ఎక్సైజ్ సీఐ అశోక్ కుమార్, ఎస్ఐ విజయ భాస్కర్, జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి పొన్నం శ్రీనివాస్ గౌడ్, గౌడ సంఘం మండలాధ్యక్షుడు పెరుమాండ్ల గంగయ్య గౌడ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 13 : జిల్లా కేంద్రంలోని సప్తగిరి కాలనీలోని కేజీబీవీలో ఖాళీగా ఉన్న ఒక అసిస్టెంట్ కుక్ పోస్టు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం 7వ తరగతి వరకు చదివి, కరీంనగర్ మండలానికి చెందిన మహిళా అభ్యర్థులు అర్హులని, ఎంపికైన వారికి రూ. 9,750 వేతనం ఉంటుందని చెప్పారు. ఆసక్తిగల మహిళా అభ్యర్థులు బయోడేటా, అర్హత సర్టిఫికెట్లతో 14వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా జిల్లా కేంద్రంలోని మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

డ్రగ్స్‌వాడకంతో భవిష్యత్ చిత్తు: నార్కోటిక్ ఏసీపీ

తిమ్మాపూర్, ఆగస్టు13: డ్రగ్స్ వాడకం వల్ల భవిష్యత్తు చిత్తవుతుందని, విద్యార్థులు దానికి మత్తుపదార్థాలకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించాలని నార్కోటిక్ ఏసీపీ ఉపేందర్ సూచించారు. బుధవారం రామకృష్ణకాలనీ గ్రామంలో గల వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. అనంతరం యాంటీ డ్రగ్స్ పోస్టర్ ఆవిష్కరించారు. విద్యార్థులతో డ్రగ్స్ ముట్టుకోబోమని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల సెక్రటరీ గంద్ర శ్రీనివాస్ రెడ్డి, నార్కోటిక్ సీఐ కృష్ణమూర్తి, తిమ్మాపూర్ సీఐ స్వామి, జాయింట్ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సాయినాథ్, అధ్యాపకులు, అధికారులు పాల్గొన్నారు.

షీటీం ఆధ్వర్యంలో అవగాహన

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 13 : జిల్లా కేంద్రంలోని వాగేశ్వరి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో షీ టీం ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి షీటీం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పీ శ్రీలత హాజరై మహిళల భద్రత, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారం కోసం సంప్రదించాల్సిన విభాగాల గురించి విద్యార్థినులకు వివరించారు. మహిళల భద్రతే లక్ష్యంగా పనిచేస్తున్న షీటీంలను కళాశాలల చైర్మన్ బీవీఆర్ గోపాల్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో షీటీం ఏఎస్ఐ విజయమణి, ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకట్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రమణ, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ స్వప్న, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా రమేశ్‌గౌడ్

సైదాపూర్, ఆగస్టు 13: మండలకేంద్రానికి చెందిన అనగోని రమేశ్‌గౌడ్ తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం హుస్నాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తనను నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు మేకపాటి నరేందర్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కల్యాణలక్ష్మితో భరోసా: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, ఆగస్టు 13: పేద, మధ్య తరగతి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మితో ప్రభుత్వం భరోసా కల్పిస్తున్నదని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 22 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కల్యాణలక్ష్మి చెక్కులు అందజేసిన ఎమ్మెల్యేకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం పక్కనే ఉన్న సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. భవనం శిథిలావస్థకు చేరుకుందని, వానకాలంలో తేమతో రికార్డులు తడిచిపోతున్నాయని సిబ్బంది ఎమ్మెల్యేకు వివరించారు. కాగా, నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం ఉన్న భవనం మరమ్మతులకు కోసం నిధులు కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో కురిక్యాల సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్‌రావు, వైస్ చైర్మన్ వేముల భాస్కర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పురుమల్ల మనోహర్, నాయకులు సత్తు కనకయ్య, గుజ్జుల బాపురెడ్డి, రామిడి రాజిరెడ్డి, జాగిరపు శ్రీనివాస్‌రెడ్డి, కర్ర బాపురెడ్డి, రోమాల రమేశ్, తోట కరుణాకర్, దాతు అంజయ్య పాల్గొన్నారు.

నేడు తిరంగా సైక్లింగ్ ర్యాలీ

సమావేశంలో మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి

కొత్తపల్లి, ఆగస్టు 13 : కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్, అల్ఫోర్స్ విద్యా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం తిరంగా సైక్లింగ్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ చైర్మన్ డా. వీ నరేందర్‌రెడ్డి, అధ్యక్షుడు డా. బి. మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో తిరంగా సైక్లింగ్ ర్యాలీ నిర్వహణపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ, త్యాగధనుల పోరాట ఫలితంగా సిద్ధించిన స్వాతంత్ర్యం గొప్పదనాన్ని నేటి తరమైన విద్యార్థులకు తెలియజేయడంతో పాటు సైక్లింగ్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు తిరంగా సైక్లింగ్ ర్యాలీ చేపడుతున్నామని తెలిపారు. వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్ నెక్స్ట్ మైదానం నుంచి ఉదయం 6.20గంటలకు ప్రారంభమయ్యే ర్యాలీ తెలంగాణ చౌక్ వరకు కొనసాగుతుందన్నారు. ఈ ర్యాలీలో 6వ తరగతి నుంచి పై తరగతుల వాళ్లు సైకిళ్లతో పాల్గొనవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 9398230614 సెల్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

సాగులో మెళకువలు పాటిస్తేనే అధిక దిగుబడులు

జమ్మికుంట, ఆగస్టు 13: వరి, పత్తి సాగులో మెళకువలు పాటిస్తేనే అధిక దిగుబడులు సాధ్యమని, ప్రతి రైతు శాస్త్ర, సాంకేతిక సహాయంతో వ్యవసాయం చేస్తే ఆర్థికాభివృద్ధి సాధిస్తారని కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ వెంకటేశ్వర్‌రావు, శాస్త్రవేత్తలు జక్కుల విజయ్, శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ మహేశ్, ఈస్ట్ రీజనల్ మేనేజర్ సుబ్ర సుమన్ మహంతి(ఒడిశా) పేర్కొన్నారు. మంగళవారం కృషి జాగరణ్ ఆధ్వర్యంలో స్థానిక కేవీకేలో రైతులకు వరి, పత్తి పంట సాగులో మెళకువలు, తదితర అంశాలపై శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సదస్సుకు కృషి జాగరణ్‌తో పాటు.. మహీంద్రా, ధనూకా, జాతీయ విత్తన ధ్రువీకరణ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ఆయా నేలల స్వభావాన్ని బట్టి విత్తనాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు, ఎరువులు, చీడ, పీడ నివారణ, తదితర అంశాలను వివరించారు. సాగులో శాస్త్రవేత్తల సలహాలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కేవీకే ఆవరణలో మహీంద్రా ట్రాక్టర్లు, యాంత్రిక పనిముట్లు, ధనూకా ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, ఎన్ఎస్‌సీ విత్తనాలు, తదితర స్టాల్స్ రైతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు వేణుగోపాల్, ప్రశాంతి, ఆదర్శ రైతులు, అగ్రి విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాన్ని సందర్శించిన మంగళూరు అధికారుల బృందం

చొప్పదండి, ఆగస్టు 13: చొప్పదండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని బర్డ్ మంగళూరుకు చెందిన సీనియర్ అధికారుల బృందం, వివిధ రాష్ట్రాల సహకార బ్యాంక్ అధికారులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు వెల్మ మల్లారెడ్డి, సంఘం ద్వారా అందిస్తున్న రుణాలు, సేవల గురించి వారికి వివరించారు. చొప్పదండి సహకార సంఘానికి సహాయ సహకారాలు అందిస్తున్న జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ రవీందర్ రావు, సీఈవో సత్యనారాయణ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. పీడీసీ రిసోర్స్ పర్సన్ సత్యనారాయణ సహకార సంఘం చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు తదితరాల గురించి వివరించారు. కేడీసీసీ డీజీఎం ఇంతియాజ్ అలీ, కేడీసీసీ చొప్పదండి బ్రాంచ్ మేనేజర్ మనోజ్ కుమార్, సూపర్‌వైజర్ చంద్రారెడ్డి, సహకార సంఘం డైరెక్టర్ గుర్రం ఆనంద్ రెడ్డి, సంఘ కార్యదర్శి కళ్లెం తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

'మా వాట మాకే' పుస్తకావిష్కరణ

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 13 : చట్టసభల్లో స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పోరుపై తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షుడు జూలూరి గౌరీశంకర్ రాసిన పుస్తకం 'మా వాట మాకే'ను తెలంగాణ వేదిక కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఆచార్య కొత్తపల్లి జయశంకర్, తెలంగాణ తల్లి విగ్రహాల వద్ద ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్, తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర బాధ్యులు గాజోజు నాగభూషణం, బూర్ల వెంకటేశ్వర్లు, అన్నవరం దేవేందర్, కూకట్లకు తిరుపతి, తెలంగాణ రచయితల వేదిక కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షుడు సీవీ కుమార్, ప్రధాన కార్యదర్శి దామరకుంట శంకరయ్య, రచయితలు సదాశ్రీ, గుడికందుల అరుణ్, రవీంద్రాచారి, వనజ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ స్వాతంత్ర్య వేడుకలకు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, విద్యార్థికి ఆహ్వానం

వీణవంక, ఆగస్టు 13: కొత్త ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగే స్వాతంత్ర్య వేడుకలకు తెలంగాణ మోడల్ స్కూల్ ఘన్ముక్ల ప్రిన్సిపాల్ డా.వేణుగోపాల్‌రెడ్డి, 10వ తరగతి విద్యార్థి బావు శ్రీకాంత్‌కు ప్రత్యేక అతిథులుగా ఆహ్వానం అందింది. రాష్ట్రంలోని 543 పీఎం శ్రీ పాఠశాలల నుంచి ఐదుగురు ఉపాధ్యాయులు, ఐదుగురు విద్యార్థులకు ఈ అవకాశం దక్కగా ఈ బృందానికి వేణుగోపాల్‌రెడ్డి నేతృత్వం వహించనున్నారు. వీరిని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నరసింహారెడ్డి, మోడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి, సమగ్రశిక్షా జాయింట్ డైరెక్టర్ రాజీవ్, జిల్లా విద్యాశాఖాధికారి జనార్దనరావు అభినందించారు.

భర్త ఇంటి ఎదుట బైఠాయింపు

శంకరపట్నం, ఆగస్టు 13 : తమకు వివాహమై ఓ కూతురు కూడా ఉండగానే తన భర్త మరో మహిళతో సహజీవనం చేస్తున్నాడని ఆరోపిస్తూ ఓ మహిళ భర్త ఇంటి ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగింది. తిమ్మాపూర్ మండలం నల్లగొండ గ్రామానికి చెందిన శిరీష కథనం ప్రకారం.. శిరీషకు 2017లో కేశవపట్నం గ్రామానికి చెందిన ప్రవీణ్‌తో వివాహం జరిగింది. 2018లో వీరికి కుమార్తె జన్మించింది. అనంతరం కొంత కాలానికి భార్యా భర్తల మధ్య మనస్పర్థలు రావడంతో గొడవలు జరిగాయి. శిరీష తిమ్మాపూర్ పోలీస్ స్టేషన్‌లో అత్తింటి వారిపై కేసు పెట్టింది. ఈ క్రమంలో శిరీష ఐదేండ్లకు పైగా తల్లిగారింటి వద్దనే ఉంటున్నది. కేసు కోర్టులో విచారణలో ఉండి, విడాకులు తీసుకోకుండానే ప్రవీణ్ మరో అమ్మాయితో సహజీవనం చేస్తున్నాడని ఆరోపించింది. తనకు, తన ఆరేండ్ల కూతురుకు న్యాయం చేయాలని మహిళా సంఘాల సహాయంతో ఆందోళనకు పూనుకున్నట్లు తెలిపింది. సమాచారం తెలుసుకున్న ఏఎస్ఐ సుధాకర్ ఘటనా స్థలానికి సిబ్బందితో వెళ్లి విచారించారు. సమస్య ఉంటే పోలీస్ స్టేషన్‌లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని సూచించారు. వివాదం కోర్టు పరిధిలో విచారణలో ఉన్నందున చట్ట పరిధిలోనే పరిష్కరించుకోవాలని ఎస్ఐ రవి వారికి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

జాతీయజెండా ఆవిష్కరించనున్న మంత్రి శ్రీధర్‌బాబు

కలెక్టరేట్, ఆగస్టు 13: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లాకేంద్రంలో నిర్వహించనున్న వేడుకల్లో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జాతీయ జెండా ఆవిష్కరించనున్నారు. అనంతరం జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో గౌరవ వందనం స్వీకరించనున్నట్లు ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతి కుమారి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

ఉత్తమ ఉద్యోగుల జాబితాసిద్ధం

కలెక్టరేట్, ఆగస్టు 13 : స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని ఏటా ఉత్తమ ప్రభుత్వ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందించడం ఆనవాయితీ కాగా, ఈ ఏడాదికి సంబంధించి అర్హుల జాబితా సిద్ధమవుతున్నది. ఉత్తమ ఉద్యోగులను ప్రోత్సహించే క్రమంలో శాఖల వారీగా వివరాలు సేకరించే పనిలో అధికార యంత్రాంగం మూడు రోజులుగా కసరత్తు చేస్తున్నది. ఎప్పటిమాదిరిగానే జిల్లాలో ఈసారి కూడా 250 మంది వరకు ఉద్యోగులను ఎంపిక చేసే అవకాశాలున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే నలభైకి పైగా శాఖల నుంచి ఎంపిక చేసిన వారి జాబితాలు కలెక్టరేట్‌కు చేరినట్లు తెలుస్తున్నది. నేటి సాయంత్రం వరకు మిగతా శాఖల నుంచి కూడా జాబితాలు రానున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. తుది జాబితాను నేటి రాత్రి విడుదల చేయనున్నట్లు చెబుతున్నారు.

నైటింగేల్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

నైటింగేల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నర్సింగ్ ఆఫీసర్స్, సిబ్బంది

విద్యానగర్, ఆగస్టు 13 : ఫ్లోరెన్స్ నైటింగేల్‌ను ఆదర్శంగా తీసుకుని రోగులకు సేవలు అందించాలని నర్సింగ్ సూపరింటెండెంట్ శోభ నర్సింగ్ సిబ్బంది సూచించారు. మంగళవారం కరీంనగర్ ప్రభుత్వ దవాఖానలో నైటింగేల్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానల్లో సేవలందిస్తున్న నర్సింగ్ సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ శోభ, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్స్ రాజకళ, సరిత, ప్రేమల, సత్యప్రభ, నర్సింగ్ ఆఫీసర్స్ కవిత, వసంత, రాహేల్ క్రాంతి, కుమార్, దీవెన, హిమబింధు, అఖిల్, విజయ్, రాజేశ్ పాల్గొన్నారు.

ఆకాష్ నేషనల్ టాలెంట్ హంట్ ఎగ్జామ్ వచ్చే 19 నుంచి

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆకాశ్ సంస్థ బాధ్యులు

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 13 : ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జాతీయ స్కాలర్‌షిప్ పరీక్ష ఆకాష్ నేషనల్ టాలెంట్ హంట్ ఎగ్జామ్–24 అక్టోబర్ 19 నుంచి 27వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆకాష్ రీజనల్ సేల్స్, గ్రోత్ హెడ్ భరత్ కుమార్, డిప్యూటీ డైరెక్టర్ అమిత్‌కుమార్, ఏరియా బిజినెస్ హెడ్ రవి కిరణ్, అకాడమిక్ డైరెక్టర్ అంజన్ కుమార్, బ్రాంచ్ హెడ్ పెద్ది నిరంజన్ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు కరీంనగర్‌లో ఆకాష్ నేషనల్ టాలెంట్ హంట్ ఎగ్జామ్–24 వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ, తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ చదివే విద్యార్థులు ఈ పరీక్ష రాయవచ్చని, ఇందులో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి 100 శాతం స్కాలర్‌షిప్‌తో కూడా శిక్షణ అందజేస్తామని చెప్పారు. ఇందుకోసం విద్యార్థులు, తల్లిదండ్రులు anthe.aakash.ac.in లో దరఖాస్తు చేసుకోవచ్చని లేదా నగరంలోని ఆకాశ్ కేంద్రంలోని తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

పరమేశ్వర్ గురుస్వామికి 'అయ్యప్ప సేవారత్న' అవార్డు

అవార్డు అందుకుంటున్న పరమేశ్వర్ గురుస్వామి

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 13 : కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన కావేటి పరమేశ్వర్ గురుస్వామి అయ్యప్ప సేవారత్న అవార్డు అందుకున్నారు. తమిళనాడు రాష్ట్రంలోని కాంచీపురంలో జరిగిన 'అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ' జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 18 మంది గురుస్వాములకు అయ్యప్ప సేవారత్న అవార్డుల ప్రదానోత్సవం జరుగగా, ఇందులో భాగంగా ఫౌండర్, మేనేజింగ్ ఫౌండర్ ట్రస్టీ పీఎన్‌కే మీనన్, అధ్యక్షుడు అయ్యప్ప దాస్, ప్రధాన కార్యదర్శి బేతి తిరుమలరావు ఆధ్వర్యంలో శబరిమల అయ్యప్ప దేవాలయ మాజీ మేల్ శాంతులు శశికుమార్, దామోదరన్ నంబూద్రీ అయ్యప్ప సేవారత్న అవార్డును కావేటి పరమేశ్వర్ గురుస్వామికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అయ్యప్ప స్వామి అనుగ్రహంతో కరీంనగర్ జిల్లాలో అయ్యప్ప మాలధారణ చేసే స్వాములు, అయ్యప్ప సేవా సమితి సభ్యుల ఆశీస్సులు, సహకారంతోనే ఈ అవార్డు లభించిందన్నారు. అవార్డు రావడం సంతోషకరంగా ఉందని, ముఖ్యంగా ఈ అవార్డును తన జీవిత భాగస్వామి కావేటి శైలజ, కరీంనగర్ అయ్యప్ప భక్తులకు అంకితమిస్తున్నట్లు పేర్కొన్నారు.

మార్కెట్‌లోకి వీవో వి-40

వీవో వీ–40 సిరిస్‌ను లాంచ్ చేస్తున్న నవీన్

విద్యానగర్, ఆగస్టు 13 : నగరంలోని గీతాభవన్ చౌరస్తాలో గల ఎస్ మొబైల్ స్టోర్‌లో మంగళవారం వీవో వీ–40 సిరిస్ మొబైల్‌ను టెక్ క్రియేటర్ నవీన్ లాంచ్ చేశారు. కార్యక్రమంలో స్టోర్ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 13: జిల్లా కేంద్రంలో ప్రముఖ సంస్కృతాంధ్ర, ద్రావిడ, జ్యోతిష వాస్తు పండితుడు గోవర్ధన రాఘవాచార్యుల స్మృత్యర్థం ఇటీవల సాహితీ వేత్త డాక్టర్ గండ్ర లక్ష్మణ్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన అష్టావధానంలో పృచ్ఛకురాలిగా భగత్‌నగర్ సిద్ధార్థ హైస్కూల్ ఉపాధ్యాయిని ఆముక్తమాల్యద పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమెను పాఠశాల ప్రిన్సిపాల్ కట్ట సంగీత మంగళవారం జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని సాహిత్య కార్యక్రమాల్లో పాల్గొని పాఠశాల కీర్తిని చాటాలని ఆకాంక్షించారు.

అట్రాసిటి కేసుపై ఇన్‌చార్జి ఏసీపీ విచారణ

హుజూరాబాద్ రూరల్, ఆగస్టు 13: పట్టణంలోని వరంగల్ రోడ్డులో గల ఓ వైన్‌షాపు ముందు ఈనెల 11న తనను ముగ్గురు వ్యక్తులు అకారణంగా దూషించారని సైదాపూర్ మండలం నల్లరామయ్యపల్లి గ్రామానికి చెందిన సమయ్య అనే దళితుడు ఫిర్యాదు చేయగా, నిందితులు ఇప్పలనర్సింగాపూర్ గ్రామానికి చెందిన నద్దూరి శ్రీకాంత్, నద్దూరి ప్రశాంత్, శంకరపట్నం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన ఐలయ్యపై హుజూరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం ఇన్‌చార్జి ఏసీపీ విజయ్‌కుమార్ ఘటనా స్థలంలో విచారణ చేపట్టారు. ఆయన వెంట టౌన్ సీఐ తిరుమల్‌తో పాటు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఆరోగ్యశ్రీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

విద్యానగర్, ఆగస్టు 13 : ఆరోగ్యశ్రీ పథకంలో 17 సంవత్సరాలుగా పని చేస్తున్న ఆరోగ్యశ్రీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సుజాతకు ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కమలాకర్‌రెడ్డి, రమేశ్, కార్యవర్గ సభ్యులు పాషా, దేవేందర్, అర్చన, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం

మానకొండూర్, ఆగస్టు 13: మానకొండూర్ మండల పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం మంగళవారం ఎన్నికైంది. పంచాయతీ కార్యదర్శుల సంఘం మండలాధ్యక్షుడిగా ఎండీ మెహతాబ్ (కొండపల్కల), ఉపాధ్యక్షుడిగా పున్నం కిరణ్‌కుమార్(గంగిపల్లి), ప్రధాన కార్యదర్శిగా డీ సుస్మిత (లింగాపూర్), జాయింట్ సెక్రటరీలుగా జయరాజు (పచ్చునూర్), పద్మలత(ముంజంపల్లి), కోశాధికారిగా చవన్‌లాల్ (లక్ష్మీపూర్), ఆర్గనైజింగ్ సెక్రటరీగా అనిత(శ్రీనివాస్‌నగర్), కార్యవర్గ సభ్యులుగా ఎం కిరణ్‌కుమార్ (వెల్ది), జీవిత(లలితాపూర్), తిరుమలేష్(కెల్లెడు), అంజయ్య(చెంజర్ల), శారద (వన్నారం), కవిత(మద్దికుంట), రాములు(పెద్దూరుపల్లి) ఎన్నికయ్యారు. ఎంపీడీవో వరలక్ష్మి, ఎంపీవో కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

వాంటెడ్ రిసెప్షనిస్ట్

jobs Apply Now!

★వాంటెడ్ రిసెప్షనిస్ట్ (స్త్రీలు) బడ్జెట్ హోటల్ కరీంనగర్ నందు అనుభవం ఉన్నవారు/ క్రొత్తవారు కావలెను. సంప్రదించండి: సెల్: 8374306406/8500607494 NTK-00000

PLOT FOR SALE

★కరీంనగర్ హైవే ఫేస్ ఫేసింగ్‌కి DTCP, ఓపెన్ ప్లాట్స్, బెంగళూరు హైవేకి, అతి దగ్గరలో అతి తక్కువ ధరలకే ప్లాట్స్ అమ్మబడును. బ్యాంక్ లోన్ Available, ఫోన్: 8885731233, 9948033142. NT- 326217

CHANGE OF NAME

★Nadigotla Lavanya, W/o. Rajanikanth, H.No. 4-82, Rudravaram, Vemulawada Mandal, Rajanna Sircilla Dist, my Name was changed as Lingampalli Padma W/o. Rajanikanth. NTK-0000

Classified Ads



మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571

9182 777 189

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.